ఆర్‌టిసిలో కార్గో సేవలు విస్తృతం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సరుకు రవాణా అభివృద్ధికి ఆర్‌టిసి కార్మికులందరూ కృషి చేయాలని ఆర్‌టిసి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కార్గో జి.లక్ష్మీప్రసన్న, వెంకట సుబ్బారావు సూచించారు. బుధవారం ఆయన నూజివీడు డిపోలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆర్‌టిసిలో సరుకు రవాణా డిక్కీ, గ్రూప్ టాప్, కంటైనర్ అనే మూడు విధానాల ద్వారా జరుగుతుందన్నారు. డిపో నుంచి పది కిలోమీటర్ల దూరం, 50 కిలోమీటర్ల దూరం వరకు సరుకును డోర్ డెలివరీ చేసే సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. కార్గో బుకింగ్‌లో అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిపో మేనేజర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పరిహా(స)రం..!

కుక్కునూరు,వేలేరుపాడు మండలాల్లో వరద బాధితుల పరిస్థితి దయనీయం

ఏడాదైనా అందని వరద సాయం

అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల వైఫల్యంపై సర్వత్రా ఆగ్రహం

ఇల్లు కోల్పోయి ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే ఆవాసం

పట్టించుకునే నాధుడే కరువాయె

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వరదలకు సర్వంకోల్పోయి రోడ్డున పడ్డ నిర్వాసితులపట్ల కనీసం కనికరం లేకుండా పోయింది. ఏడాది గడుస్తున్నా వారికి వరదసాయం నేటికీ అందలేదు. వరదలకు ఇళ్లు కుప్పకూలిపోవడంతో ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. వరదలకు సర్వం కోల్పోయిన పోలవరం నిర్వాసితులకు వరదసాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యమా.. పాలకుల వైఫల్యమో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

గతేడాది జులైలో గోదావరి వరద బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. గోదావరి వరదల వల్ల కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వేలాది మంది నిరాశ్రయులయ్యారు. గతంలో ఎన్నడూలేనంతగా గోదావరికి వరదలు వచ్చిపడ్డాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం 71.5 అడుగులు చేరుకోవడంతో పోలవరం విలీన మండలాల్లో ప్రతి గ్రామం వరదముంపులో విలవిల్లాడింది. వరద ప్రళయానికి కట్టుబట్టలతో చెట్టుకొకరు, పుట్టకొక్కరు అన్నట్లు పరిస్థితి తయారైంది. విలీన మండలాల్లో ప్రజలకు గోదావరి వరదలు కొత్తేమీ కాదు, 1986లో వచ్చిన గోదావరి వరదల స్థాయిలో గతేడాది వరద ముంచెత్తింది. ప్రతీ గ్రామంలో 50 శాతం ఇళ్లు వరదలకు కొట్టుకుపోవడం, కూలిపోవడం జరిగింది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు ఎనిమిది వేలకుపైగా ఇళ్లు నేలమట్టమైనట్లు అధికారులు తేల్చారు. వరద బాధితులను పరామర్శించేందుకు వేలేరుపాడు మండలంలో సిఎం జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా వరదలకు సర్వం కోల్పోయిన బాధితులకు వెంటనే పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.పది వేలు ఇస్తామని తెలిపారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ ఇంటి నష్ట పరిహారం కోసం వరద బాధితులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కునూరు మండలంలో ఒకరిద్దరికి మాత్రమే ఇంటి నష్ట పరిహారం అందింది. కుక్కునూరు 'ఎ' బ్లాక్‌లో 95 శాతం మందికి, బెస్తగూడెం గ్రామంలో ఎస్‌సి కాలనీలో 369 కుటుంబాలకు, కివ్వాక, మారేడుబాక, వింజరం, కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, సీతారామనగరం వంటి గ్రామాల ప్రజలకు వరద సాయం అందలేదు. వీరంతా ఇప్పటికీ సాయం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

గత ఏడాది వరదలకు కుప్పకూలిన ఇళ్లు (ఫైల్‌ఫొటో)

ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే

వరదలకు సర్వం కోల్పోయిన వరద బాధితులు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. కుక్కునూరు 'ఎ' బ్లాక్‌కు చెందిన 200 కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా వరదలకు కుప్పకూలిపోయాయి. ఏడాది నుంచి ఇల్లు లేక కివ్వాక పునరావాస కేంద్రాల్లోనే జీవిస్తున్నారు. ఇక్కడ ఉండటం వల్ల ఉపాధి లేక రోజు గడవక వారి పరిస్థితి దయనీయంగా తయారైంది. వరద బాధితులంతా రెక్కాడితే కానీ డొక్కాడని సాధారణ ప్రజానీకమే. కూలి, నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి. ఏడాది పాటు గ్రామానికి దూరంగా ఉన్న పునరావాస కాలనీలో జీవించడంతో కూలిపనులు కూడా దొరకటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద బాధితులు ప్రస్తుతం తలదాచుకుంటున్న పునరావాస కాలనీ ఆ ప్రాంత గిరిజనుల కోసం ప్రభుత్వం నిర్మిస్తోంది. దీంతో ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని అంతా తీవ్ర ఆందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. అదే జరిగితే ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గోదావరి వరదల వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించాలని, అదేవిధంగా పోలవరం నిర్వాసితులమైన తమకు రావాల్సిన పూర్తి పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ ముంచేస్తారా

విలాసాగరపు రాంబాబు, మసీదు సెంటర్, కుక్కునూరు

గోదావరి వరదలు వచ్చే సమయం దగ్గర పడుతుండటంతో భయం భయంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుక్కునూరుకు చెందిన నా ఇల్లు, నా కుమారుడి ఇల్లు రెండూ వరదల్లో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు, ఏటా ఈ బాధలు పడలేము. ఈ బాధలు ఎవ్వరికీ రాకూడదు. మళ్లీ గోదావరిలో ముంచేలానే ఉంది పరిస్థితి.

ఏడాది గడిచినా ఇంటి నష్ట పరిహారం అందలేదు

ఎన్.మహేష్. కుక్కునూరు, రజక బజార్

గతేడాది వచ్చిన గోదావరి వరదలకు రజక బజారులోని మా ఇల్లు పూర్తిగా పడిపోయింది కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నాం. బార్బర్ షాపుపైనే ఆధారపడి భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను. ఇల్లు కట్టుకునే స్తోమత లేక పడిపోయిన ఇంటినే బాగుచేసుకుని ఉంటున్నాను. ఏడాది గడిచినా ఇంటి నష్ట పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి

కూలీలకు పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించి పే స్లిప్పులు ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - పెదవేగి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

ఉపాధి పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, ఏర్పాటు చేయాలని, పాతపద్ధతిలోనే ఉపాధి పనులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్. బుధవారం పెదవేగి మండలం కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం పర్యటించింది. ఈ గ్రామాల్లో ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాల్లో పర్యటించి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీలకు వేతనాల సకాలంలో అందడం లేదని, దీనివల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాల్సిన అధికారులు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ద్వారా ఎపిఒ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ప్రశ్నిస్తే పే స్లిప్పుల, మస్తర్ షీట్లు ప్రింటింగ్ ఖర్చులు అంటూ చెబుతున్నారన్నారు. జిల్లాలో అనేక మండలాల్లో ఎపిఒలే కూలీల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటోస్ సిస్టం వల్ల పనిలో నాణ్యత తగ్గేవిధంగా విధానాలున్నాయన్నారు. దీనివల్ల పనిదినాలు తగ్గడంతో పాటు పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందడంలేదన్నారు. మస్తర్ షీట్‌లో పేర్లు ఇంగ్లీషులో ఉండడం వల్ల ఒకరి పేరున మరొకరు పని చేయడం, పనికి రాకపోయినా మస్తర్ వేస్తున్నారని, అసలైన కూలీలకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మస్తర్ ప్రకారం కనీసవేతనం రూ.272 ఇస్తున్నామంటూ ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయని, కానీ ఒక్కరికి కూడా పూర్తిస్థాయి వేతనం వేయలేదన్నారు. దూరప్రాంతాలకు కాలినడకన వెళ్లే వారికి రవాణా ఖర్చులు ఇవ్వడం లేదన్నారు. కూలీలకు కనీస వేతనం రూ.వంద నుండి రూ.150 మాత్రమే పడుతుందన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలైన తాగునీరు, మజ్జిగ, పనిముట్లు, మెడికల్ కిట్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీర్రాజు, రమేష్, ఆంజనేయులు, సుజాత, భవాని పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక' వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మునేపల్లిలో ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలకేంద్రమైన ముదినేపల్లిలో బుధవారం సాయంత్రం ఈదురగాలులు బీభత్సం సృష్టించాయి. సాయంత్రం ఐదుగంటల సమయంలో ఆకాశం మేఘవృతమై మబ్బులు కమ్ముకుని బలమైన ఈదురుగాలులు వీయడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలులకు పెద్దఎత్తున దుమ్ము, ధూళి ఎగిరిపడడంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకుల ఇక్కట్లు పడ్డారు. బలమైన గాలులకు గుడిసెలు, చిరువ్యాపారుల పాకలు డేరాలు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, ఫెక్సీలు ధ్వంసమయ్యాయి. బలమైన ఈదురగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అంగన్‌వాడీ గుడ్లు అందిస్తున్న సాయిబాలపద్మ

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఛైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మ అన్నారు. స్థానిక రెండో వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలకు అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం నాణ్యతను పరిశీలించి సంతృప్తి చేశారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలను, ప్రోత్సాహాన్ని లబ్ధిదారులందరూ పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పెసర గంటి గంగ, సిడిపిఒ పి.బ్యులా, సూపర్‌వైజర్ ఎం.మంగతాయారు, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, హెల్పర్ లక్ష్మి పాల్గొన్నారు.

యాసిడ్ దాడి ఘటన బాధితురాలు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మృతిచెందిన ఫ్రాన్సిక

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫ్రాన్సిక పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు నగరంలోని జేవియార్ నగర్‌కు చెందిన ఎడ్ల ఫ్రాన్సిక(35) స్థానిక డెంటల్ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తుంది. ఆమెకు భర్త ఆంజనేయులు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య కలహాలు రావడంతో భర్తకు దూరంగా కుమార్తెతో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ తరుణంలో ఈనెల 13వ తేదీన రాత్రి 9:30 గంటల సమయంలో విధులు ముగించుకుని ఆమె ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై యాసిడ్ దాడి చేశారు. ఈ దాడిలో ఆమె తీవ్రగాయాల పాలైంది. మెరుగైన వైద్యం కోసం మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి విచారణ చేపట్టారు. 24 గంటల వ్యవధిలో ఈ దాడికి కారణమైన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నాలుగు రోజుల వ్యవధిలో యాసిడ్ కొనుగోలు చేసి నిందితులకు ఇచ్చిన వ్యక్తిని, విక్రయించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులను ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.16 లక్షలు సహాయంగా అందించింది. ఈ తరుణంలో ఆమె మృత్యువుతో పోరాడి పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సోదరి ప్రేమకు అడ్డుగా ఉందని దాడి

ఈ కేసులో ప్రధాన నిందితుడు సతీష్‌కు మృతురాలి ఫ్రాన్సిక సోదరికి మధ్య ప్రేమ వివాహం నడుస్తోంది. ఈ విషయం తెలిసిన ఫ్రాన్సిక పలుమార్లు సోదరిని, సతీష్‌ను మందలించింది. దీంతో అక్కను పెంచుకున్న సతీష్ తన ప్రేమకు అడ్డుగా ఉందనే కారణంతో పథకం ప్రకారం సతీష్ ఈ దాడికి పాల్పడినట్టు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి స్పష్టం చేశారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో యాసిడ్ కొనుగోలు చేసి తెచ్చిన ఏలూరు కత్తేపు వీధికి చెందిన షేక్ ఖాజాబాబు, అనుమతుల్లేకుండా యాసిడ్ విక్రయిస్తున్న కోళ్ల త్రివిక్రమరావు, అతని గుమస్తా వి.సత్యనారాయణ, వన్‌టౌన్‌కు చెందిన ప్రధాన నిందితుడు బి.సతీష్, వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన డెహరా మోహన్, బూడిద ఉషాకిరణ్ ఉన్నారు.

చింతమనేని పరామర్శ

దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మృతురాలి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి అన్ని రకాలుగా ఆమె కుటుంబానికి సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏలూరు టౌన్ : మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ప్రకటించిన ఆర్థిక సాయాన్ని ఎపి మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిసాల వరప్రసాద్, ఎస్‌ఎంఆర్ పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ నర్సు చిరంజీవి, డిప్యూటీ మేయర్ సుధీర్, ఏలూరు నగర కార్పొరేటర్లు కిలాడు జ్యోతి దుర్గారావు, నున్న స్వాతి, మున్నుల జాన్ గురునాథ్ నరేంద్ర, అన్నపూర్ణ, జయకర్, కె.సాంబ అందించారు. మృతురాలి కుటుంబసభ్యులను వైసిపి ప్రజాప్రతినిధులు పరామర్శించారు. వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితులను కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పోలవరం పోరుకేకను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రారంభించిన పోలవరం పోరుకేక మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పోరుకేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నెల్లిపాకలో ప్రారంభమైన మహా పాదయాత్ర ఈ నెల 30వ తేదీన 600 మందితో జంగారెడ్డిగూడెం చేరుకుంటుందని తెలిపారు. అలాగే స్థానిక జెపి సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం నుండి జూలై నాలుగో తేదీకి విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. నిర్వాసిత సమస్యలపై పోరుకేక మహా పాదయాత్ర విజయవంతానికి ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. 400 కిలో మీటర్లు సాగే ఈ యాత్రలో నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబు సుభాని, వంగా గోపి, మండల కమిటీ సభ్యులు బొడ్డు రాంబాబు, నాయుడు నాని, స్టాలిన్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో మెడి కల్ కాలేజీ నిర్మాణ పనుల్లో మృతి చెందిన సాదిర్ అలీ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల వద్ద కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ ఏలూరులో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు బెంగాల్, బీహార్ తదితర ప్రాంతాల నుంచి వలస కార్మికులను రప్పించి పనులు చేస్తున్నారని, ఈ కార్మికులకు పనులు వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు. పని చేస్తుండగా మంగళవారం రాత్రి సాధీర్ అలీ అనే బెంగాల్ వలస కార్మికుడు మృతి చెందాడన్నారు. మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు చేపట్టిన మెగా కంపెనీ దాని సబ్ కాంట్రాక్టర్లు మృతుని కుటుంబాన్ని ఆదుకునే చర్యలు చేపట్టకుండా మృతదేహాన్ని తరలించాలని చూస్తున్నారన్నారు. దీంతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల వద్ద కార్మికులకు అండగా ధర్నా చేపట్టామని తెలిపారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి మెగా కంపెనీ రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని సోమయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం మరో రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి పనులకు తీసుకొస్తున్న వలస కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ కలెక్టర్ జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.25 లక్షల పరిహారాన్ని అదనంగా అందించాలన్నారు. ఇది కంపెనీ నుంచి ఇచ్చే పరిహారానికి అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, జిల్లా నాయకులు జె.గోపి పాల్గొన్నారు.

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ...

రెండో రోజు ఉత్సాహంగా సాగిన మహాపాదయాత్ర

ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో చేపట్టిన నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర రెండో రోజు బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. అడుగు అడుగునా హారతులతో పాదయాత్రకు ముంపు గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మండుటెండను సైతం లెక్క చేయకుండా కొనసాగించింది. మురుమూరు గ్రామంలో 'ఉపాధి హామీ' పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కూలీలతో కలిసి వి.శ్రీనివాసరావు గునపం పట్టారు. పాదయాత్రకు కాచవరంలో వైసిపి నాయకులు, దూగుట్టులో టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. దూగుట్ట గ్రామంలో ప్రజలతో శ్రీనివాసరావు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాచవరం ఎస్‌సి కాలనీ వాసులు తమకు వరద ముంపు సమయంలో నిత్యావసరాలు ఇవ్వలేదని పాదయాత్ర దృష్టికి తెచ్చారు. పోలిపాకలో గోదావరి ముంపులో తమ గ్రామం ఉన్నా ముంపులో లేదని అధికారులు చెపుతున్నారని స్థానికులు వాపోయారు. కూళ్లపాడులో ఆ గ్రామానికి చెందిన మడకం లక్ష్మి తన సమస్యలను తెలియజేసింది. గత ఏడాది ముంపునకు గురై తన ఇల్లు పాడైందని, ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించలేదని తెలిపింది. వరదల్లో మునిగి ఉన్న నిర్వాసిత ప్రాంత ప్రజలను వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏనాడూ పట్టించుకోలేదని నాయకులు విమర్శించారు. సిపిఎం మాత్రం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రెండో రోజు పాదయాత్ర సాగింది ఇలా...

రెండో రోజు బుధవారం ఉదయం ఎటపాక మండలం మురుమూరులో ప్రారంభమై కూనవరం మండలంలోకి ప్రవేశించి పోలిపాక, పోచవరం కాలనీ వరకు సాగింది. అక్కడ ఉదయం అల్పాహారం అనంతరం పోచవరం, కాచవరం, దూగుట్ట మీదుగా కూళ్లపాడుకు మధ్యాహ్నం సమయానికి చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనాలు చేశారు. అక్కడ నుండి నర్సింగపేట, పొట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్ మీదుగా పల్లూరు వరకు సాగింది. సాయంత్రం అక్కడ ఆవుల నాగమయ్య స్థూపానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, మీదుగా రాత్రికి టేకులబోరు గ్రామానికి చేరింది. అక్కడ రాత్రి భోజనం చేసి బస చేశారు.

మురుమూరు గ్రామాన్ని 41 కాంటూరులో కలపాలని వినతిపత్రం ఇస్తున్న ఆ గ్రామస్తులు

కాళ్లకు చెప్పులు లేకుండా 15 కిలో మీటర్ల నడక

సిపిఎం చేపట్టిన పాదయాత్రలో ఓ బాలిక కాళ్లకు చెప్పుల్లేకుండా 15 కిలోమీటర్లు నడిచింది. మంగళవారం ఎటపాక మండలం నెల్లిపాకలో పాదయాత్ర ప్రారంభం కాగా, అక్కడ నుండి తొలిరోజు పాదయాత్ర ముగిసిన మురుమూరు వరకు ఆ బాలిక చెప్పులు లేకుండా నడిచి అందరికీ స్ఫూర్తిగా నిలిచింది.

పరిస్థితి విషమించి వార్డు వాలంటీరు మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



రామాంజనేయులు (ఫైల్‌ఫొటో)

మండలంలోని పంగిడిగూడెంలో వాలంటీర్‌గా పని చేస్తున్న కుక్కల రామాంజనేయులు (29) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల వేసవి వడగాల్పులకు కుక్కల రామాంజనేయులు తీవ్రంగా నీరసించిపోయాడు. ఈ క్రమంలో రాజమండ్రిలో వైద్యం పొందాడు. అయినప్పటికీ బిపి అధికంగా ఉండటంతో కొద్ది రోజులు మందులు వాడుతూ ఇంటికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం బైక్‌పై లక్కవరం నుంచి పంగిడిగూడెం వెళ్తుండగా కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన రామాంజనేయులును బంధువులు రాజమండ్రి ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతుడు పంగిడి గూడెం పదో క్లస్టర్‌లో వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని బంధువులు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉంగుటూరు డిప్యూటీ తహశీల్దారుగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. భీమడోలు సివిల్ సప్లై గోడౌన్ డీటీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఉంగుటూరు డీటీగా వచ్చారు. దుర్గాప్రసాద్ గతంలో ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేశారు. ఆయన స్వగ్రామం నారాయణపురం. సొంత మండలంలో ప్రజలకు సేవలందించే భాగ్యం కలగడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఉత్తమ ఉద్యోగి అవార్డును పొందారు.



దుర్గాప్రసాద్

మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

30 చలో విజయవాడ

ప్రజాశక్తి - భీమడోలు

రైతాంగ సమస్యలపై ఈ నెల 30వ తేదీన నిర్వహించే చలో విజయవాడ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహణపై రైతు సంఘం సభ్యులతో శ్రీనివాస్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో సాగునీటి వనరుల్లో సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. కౌలు రైతులకు పంట రుణాలను ఇవ్వాలని, సున్నా వడ్డీ రాయితీ పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని, ధాన్యం రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా సహ సమన్వయకర్త వెజ్జు శ్రీరామచంద్రమూర్తి,గుర్రం రాంబాబు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకుని ఆర్థిక క్రమశిక్షణ పాటించడం అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. ఇండియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌బిఐ ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యతపై మండవల్లి, ముదినేపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్విజ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏదో ఒక బ్యాంకులో ఖాతా తెరిచి ప్రతి నెల కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవడం ఇప్పటి నుంచూ అలవాటు చేసుకోవాలన్నారు. ఈ అలవాటు భవిష్యత్తులో ఎటువంటి ఆర్థిక అవసరం ఎదురైనా తట్టుకునే శక్తి ఇస్తుందన్నారు. అనంతరం ఆదాయం, పొదుపు, వ్యయం, బ్యాంకింగ్ వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విజ్ పోటీల్లో లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వెంకటవినయ్, బి.విష్ణు శివ ప్రథమ బహుమతి సాధించగా మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.వివేక్, ఎం.సాయిశ్రీ ద్వితీయ స్థానాన్ని సాధించారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.సుష్మ, ఎఎన్ఎస్‌వి.మణికంఠ తృతీయ బహుమతిని సాధించారు. మొదటి బహుమతి రూ.ఐదు వేలు, రెండో బహుమతి రూ.నాలుగు వేలు, మూడో బహుమతి రూ.మూడు వేల చొప్పున వారి అకౌంట్‌లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్క రరావు, వై.శారద, కో-ఆర్డినేటర్ బి.కనకదుర్గమ్మ, ఎంవి.రత్నం, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వేణుబాబు, భానుమతి, కుమారస్వామి పాల్గొన్నారు.



చిన్నారులకు రక్తమార్పిడి చేస్తున్న వైద్యులు

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో పదిమంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. యుఎస్ఎ నుంచి వచ్చిన నాన్సీలిన్, అబిగైల్ జియానా, ప్రణయ రెడ్డి, అఖిల్ రెడ్డిలు జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని, తలసేమియా భవనాన్ని సందర్శించి చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ రెడ్‌క్రాస్ చేసే సేవా కార్యక్రమాలు బాగున్నాయని, అమెరికాలో కూడా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ అంశాల మీద శిక్షణ ఇచ్చి వారి సేవలను విపత్తుల సమయాల్లో ఉపయోగించుకుంటారని చెప్పారు. అనంతరం తలసేమియా చిన్నారులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 30 మందికి ఉచిత భోజనం నాన్సీలిన్, అబిగైల్ జియానా ఏర్పాటు చేశారని బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, బి.పద్మజావాణి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటు సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నాటు సారా విక్రయిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని దర్భగూడెం గ్రామానికి చెందిన వీరంకి నాగమణి వద్ద నాటు సారా ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నాగమణి వద్ద పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ విచంద్ర శేఖర్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాకరవాడలో చెరువు అక్రమ తవ్వకాలు

పత్తాలేని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అధికారులు ఉన్నా ప్రజాసమస్యలపై స్పందించడంలేదు. ప్రజలు ఫిర్యాదులు చేసినా మౌనం వహిస్తున్నారే తప్ప ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రాత్రి సమయాల్లో కొందరు బడాబాబులు హడావుడిగా పొక్లెయిన్లు ఏర్పాటు చేసి వెలుగు రాకుండానే చెరువు తవ్వకాలు పూర్తి చేయడం గమనార్హం. మండలంలోని కాకరవాడ శివారు దేవరం గ్రామ ముఖద్వారం వద్ద ఈ నెల 19వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో హడావుడిగా పొక్లెయిన్ దింపిన బడాబాబు తెల్లవారేసరికి రొయ్యలచెరువు తవ్వకాలు పూర్తి చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మండల రెవెన్యూ అధికారులతో బడాబాబు కుమ్మక్కై ఈ విధంగా అర్ధరాత్రి వేళలో చెరువు తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న కొందరు యువకులు తవ్వకాలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సదరు బడాబాబు తవ్వకాలు అపేదేలేదనడంతో ఈ విషయం యువకులు వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా, సదరు అధికారులు అపేస్తామంటూ ప్రగాల్భాలు పలికి వెంటనే తమ సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. ఆ మరుసటిరోజు తెల్లవారే సరికి చెరువు తవ్వకం పనులు పూర్తి చేసి పొక్లెయిన్ బయటకు వెళ్లిపోయింది. దీంతో గ్రామస్తులు ఉదయం మండల తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. గతంలో రెండుసార్లు అనుమతులు లేకుండా ఇళ్ల సమీపంలో అక్రమంగా ట్రాక్టర్లతో చేను దున్ని, బ్లేడ్ లాగుతున్న వ్యక్తిపై తమకు ఫిర్యాదు చేయగా మండల ఆర్ఐ శివకుమార్ వచ్చి చెరువు తవ్వకం పనులు నిలుపుదల చేశారన్నారు. ఈ నెల 19న సోమవారం రాత్రి సమయాల్లో చెరువు తవ్వకానికి అనాధికరికంగా అనుమతులు ఇచ్చి చెరువు తవ్వకానికి సహకరించడం సరైన పద్ధతి కాదని గ్రామస్తులు తహశీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అదే వ్యక్తి చీకటిలో గుట్టుచప్పుడు కాకుండా పొక్లెయిన్ తెచ్చి రాత్రికి రాత్రే చెరువు తవ్వేసినట్లు తెలిపారు. వెంటనే తవ్విన చెరువు గట్లు పూడ్చి వేయాలని, అలా చేయకుంటే వేరే వ్యక్తులు మళ్లీ తవ్వకాలు చేసే అవకాశం ఉందన్నారు. గట్లు పూడ్చని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇకపై గట్టి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై తహశీల్దార్ కె.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తన దగ్గరకు ఎవరూ రాలేదని తెలిపారు. స్పష్టమైన వివరణ ఇచ్చేందుకు ఆయన నిరాకరించారు.

అక్రమంగా తవ్విన చెరువు

మట్టిని ట్రాక్టర్లలో లోడు చేస్తున్న జెసిబి

మండలంలోని గురజ గ్రామంలో సోమవారం రాత్రి నాగేంద్రస్వామి ఆలయం వెనుక ఉన్న చేలో ఇటీవలే వైసిపి తీర్థం పుచ్చుకున్న వ్యక్తి అక్రమ చెరువు తవ్వి, మట్టి తోలకాలు చేపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న మరో గ్రామ వైసిపి నేత మండల రెవెన్యూ అధికారులకు తెలియచేసేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు స్పందించలేదు. దీంతో చేసేదిలేక రాత్రి 12 గంటల సమయంలో ఏలూరు ఆర్‌డిఒకు ఫోన్ చేసి అక్రమ మట్టి తోలకాల గురించి తెలియజేయడంతో ఆయన అదేశాలు మేరకు రాత్రి ఒంటి గంట సమయంలో అక్రమ మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ రీతిగా మండలంలోని అన్ని గ్రామాల్లో అక్రమ చెరువుల తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ విషయమై గ్రామ విఆర్‌ఒను వివరణ కోరగా తమ చేతుల్లో ఏమీ లేదని, ఉన్నతాధికారులు చెప్పినట్లు తాము నడచుకోవాల్సిందేనని, మట్టి తోలకాలు తహశీల్దార్‌కు చెప్పి నాయకులు పనులు చేసుకుంటున్నారని చెప్పారు.

నాగులగూడెంలో పేదల ఇళ్లు తొలగింపు

పెట్రోల్ సీసాతో బాధితుల అడ్డగింత



అడ్డగింత పనులను అడ్డుకుంటున్న బాధితులు

పెట్రోల సీసాతో బాధితురాలి ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని నాగులగూడెం గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి సునీల్ ఆధ్వర్యంలో పోలీస్, సచివాలయ సిబ్బంది నాగులగూడెం ప్రభుత్వ పోరంబోకు భూమిలో 39 కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించేందుకు యంత్రాలతో వెళ్లారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఎదురుగా ఉన్న మార్గంలో ఆక్రమణలను తొలగించాలని కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వులు అందుకున్న రెవెన్యూ పోలీస్ సిబ్బంది పేదలు నివాసం ఉంటున్న గుడిసెలను తొలగించేందుకు సన్నద్ధమయ్యారు. 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను అడ్డగోలుగా తొలగించడం సరికాదని బాధితులు వాపోతున్నారు. 39 కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నట్లు బాధిత కుటుంబాలు చెబుతున్నారు. ఓ దశలో తమ ఇళ్లను తొలగిస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు కండేల్లి లక్ష్మి పెట్రోల్ చేత పట్టుకుని అధికారులను అడ్డగించారు. నివాసాలను ఖాళీ చేయాల్సి వస్తే తమకు మరోచోట ఇల్లు కట్టించి అప్పగించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండతో తమకు ప్రభుత్వ ఇల్లు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. నాగులగూడెం గ్రామంలో ఉన్న మరో ప్రభుత్వ భూమిని అయినా తమకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరుతున్నారు. ఉన్నపాటుగా అధికారులు నివాసాలను తొలగించడానికి చొరవ చూపటం బాధాకరమని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా తమ గోడు వినాలని బాధితులు ఏంత్ర మేరీమాత, కండెల్లి లక్ష్మి, పొద్దుటూరి రాణి, మాదాసి కుమారి, లాగు పావని, కె.రత్నం, సుబ్బమ్మ, కోనపాము లక్ష్మి, పలువురు కోరుతున్నారు.

జగనన్న విద్యాకానుక అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. సర్పంచి, స్థానిక ఎంపిటిసి సభ్యులు ఎ.దేవీనాగేంద్రప్రసాద్‌తో కలిసి గ్రామంలోని ఎంపిపి-1,2 ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. రెండు పాఠశాలల్లో జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.తులసి, మోహనరావు పాఠశాలల ప్రగతి, ప్రభుత్వపరంగా విద్యార్థుల కేటాయించిన జగనన్న విద్యాకానుకలు, ఇతర ప్రోత్సాహకాల వివరాలను వారికి తెలిపారు. గ్రామ పరిధిలో విద్యావ్యాప్తికి తమ వంతు సహకారం అందిస్తామని సర్పంచి, ఎంపిటిసి హామీ ఇచ్చారు.

'జగనన్న సురక్షా' నిర్వహణలో ప్రజాప్రతినిధులే కీలకం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుతెన్నులను గమనించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని మండల ప్రత్యేకాధికారి డిఎల్‌పిఒ రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో డిఎల్‌పిఒ మాట్లాడారు. జులై ఒకటో తేదీ నుంచి 31 వరకు సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిశ్చయించిందని తెలిపారు. కార్యక్రమం విధివిధానాలను వివరించారు. అర్హులై ఉండి ఏదైనా పథకం రాకపోతే అందుకు కారణాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే సురక్షా కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, తహశీల్దార్ రమణరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఎంపిటిసి ఛాంబర్ మండల అధ్యక్షుడు నాగరాజు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



ఉంగుటూరులో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

వెలవెలబోయిన సమావేశం

మండలంలో 27 గ్రామ సర్పంచులు, 23 మంది ఎంపిటిసి సభ్యులు హాజరు కావాల్సిన సమావేశానికి కొంతమంది మాత్రమే వచ్చారు. ప్రజాప్రతినిధులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సురక్షా కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే హాజరు కాకపోవడంపై విస్మయం వ్యక్తం అవుతోంది.

కైకలూరు : జగనన్న సురక్షతో మరింత ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందని ఎంపిపి అడవి కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలోని రైతు కళ్యాణ మండపంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జహీర్, కైకలూరు సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి, పార్టీ మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మండవల్లి

ఆరోగ్యపరమైన అనేక రుగ్మతల నుంచి కాపాడుకోవడానికి యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని పెరికేగూడెం సర్పంచి పెరుమాళ్ల పద్మ అన్నారు. స్థానిక వెల్నెస్ సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి దయనందన జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాల నుంచి దూరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. యోగా వల్ల మంచి ఆరోగ్యంతో పాటు ప్రశాంతమైన జీవనానికి అవకాశం ఉంటుందన్నారు. చిన్నారులు యోగా సాధన చేస్తే వారిలో ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి పెరుగుతాయని తెలిపారు. అనునిత్యం యోగా సాధన చేస్తే ఆరోగ్యపరమైన మంచి ఫలితాలతో పాటు సుఖ సంతోషాలతో జీవించవచ్చని ఆమె వివరించారు. అనంతరం యోగాసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వల్లూరి సీతామహాలక్ష్మి, ఎఎన్ఎం యేసు ప్రేమ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భీమడోలు : యోగా సాధన ద్వారా ఆరోగ్య పరిరక్షణ పొందవచ్చని అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ తెలిపారు. పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో యోగా అంశాలను ప్రదర్శించారు. గ్రామస్తులకు యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం మన ఆరోగ్యం మన చేతుల్లో అంటూ నినాదాలు చేస్తూ పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.విజయకుమారి, దుర్గానందిని, జాన్సీ, ఎంఆర్.భారతి, జ్యోతిబసు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయిగూడెం డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యువిఎన్.మహేంద్రబాబు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ మర్రి వెంకటేష్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.అక్కులన్నప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌జియుకెటి నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఛాన్సలర్ ఆచార్య కేసిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి యోగాసనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు, నూజివీడు ఎఒ ప్రదీప్, అకాడమిక్ డీన్ లక్ష్మణ్, పిఆర్‌ఒ సురేష్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో బుధవారం కామయ్యపాలెంలోని అమృత్ సరోవర్ చెరువు వద్ద ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధి హామీ ఎపిఒ జాన్‌వెస్లీ తెలిపారు. ప్రతిఒక్కరూ నిత్యం యోగా, ధ్యానం చేయాలని సూచించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పలు పాఠశాలల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడారు. ప్లాష్ టీం, జాబిల్లి మెగా ఫ్రెండ్స్ వారి సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, యోగా టీచర్ కమ్ముల ఆదినారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు పడాల సత్యనారాయణ అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ప్రాముఖ్యత తెలియజేస్తూ బుధవారం యోగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రముఖ యోగా గురువులు రాయల దుర్గారావు, మోరుపాక సత్యనారాయణచారిలను స్థానికులు ఘనంగా సన్మానించారు.

కైకలూరు : ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. ఎన్‌జిఒ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవాసమితి మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్.రాజు, సెక్రటరీ లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ శంకర్ శాస్త్రి, మహిళా ప్రతినిధి ఎండి రజిమున్నిసా, లైబ్రరీ సెక్రటరీ రమాదేవి, సీనియర్ న్యాయవాదులు పవన్‌కాంత్, ఎపిపి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జెడ్‌పి హైస్కూలులో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాధికా రాణి మాట్లాడుతూ యోగా వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు వివరించారు.

ముసునూరు : యోగాతో ఆరోగ్యంగా ఉండొచ్చని భారతి విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ కొండేటి శౌరి అన్నారు. మండలంలోని ముసునూరు భారతి విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి విద్యా నికేతన్ పాఠశాల కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయాలన్నారు.

పశుబీమా పథకంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పశు సంవర్ధక శాఖ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పశుబీమా పథకంపై పాడి రైతులకు అవగాహన సదస్సు జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్య శాలలో నిర్వహించినట్లు వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ ఎడి సాయి బుచ్చారావు తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ రామచంద్రరావు ఏలూరు ఉప సంచాలకులు పశు బీమా పథకం గురించి రైతులకు వివరించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి 80 శాతం, ఎగువ ఉన్న వారికి 50 శాతం రాయితీతో ఇన్సూరెన్స్ ప్రీమియం కడితే పాడి రైతులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ అవగాహన సదస్సుకు జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండల పాడి రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రంగనాథ్, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసన్, లక్ష్మీప్రసన్న, సత్యనారాయణ రాజు, భవాని, మూడు మండలాల పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వల్లంపట్ల మాజీ సర్పంచి సుభద్ర మృతి

ప్రజాశక్తి - టి నరసాపురం

మండలంలోని వల్లంపట్ల పంచాయతీ మాజీ సర్పంచి సామంతపూడి సుభద్ర (75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. 1995 నుండి 2000వ సంవత్సరం వరకు సర్పంచిగా పని చేసిన ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, మాజీ ఎంపిపి కొత్త ప్రకాష్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సుభద్ర (ఫైల్)

కుళాయి ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో గత 8 ఏళ్లుగా సెవెంత్ డే చర్చిలో మారపాక విజయరావు పాస్టర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో పంచాయతీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేసుకునేందుకు విజయరావు భార్య, కుమార్తె గ్రామ సర్పంచ్ అయిన చిమటబోయిన పుల్లారావు గృహానికి వెళ్లి అనుమతి అడిగారు. కుళాయి కావాలంటే తన కాళ్ళు పట్టుకొని బ్రతిమలాడాలని సర్పంచి మాట్లాడినట్లు విజయరావకు ఆయన భార్య, కుమార్తె చెప్పారు. దీంతో పాస్టర్ గ్రామ కార్యదర్శి అయిన ఎంవిఎస్.నాగరాజుకు విషయం తెలుపగా మంచినీటి కుళాయి కావాలంటే కొన్ని నెలలు ఆగాలని చెప్పారు. పాస్టర్‌కు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన సిఐటియు చాట్రాయి మండల కార్యదర్శి కొలిక్కిపోవు భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ విజయరావుతో కలిసి మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని టి.నరసాపురం సర్పంచి మొదుగు సునంద అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.లింగస్వామి, విద్యాకమిటీ ఛైర్మన్ పుట్టాల నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు నార్లపాటి వెంకటేశ్వరరావు, దేవరపల్లి సీతారామప్రసాద్, కన్నం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్‌విజి.కృష్ణారావు, కె.కుటుంబరావు, రాజు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.11,23,794

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. 87 రోజులకు రూ.11,23,794 నగదు, రెండు గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ శౌంఠి నాగరాజు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ఆలయ ఎసి నేల సంధ్య, ఆలయ ధర్మకర్తలి మండలి సభ్యులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్సు పోయినవి

ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, పూళ్ళ గ్రామ కాపురస్తులు అయిన మాకాని వెంకట హరిబాబు, S/o. నాగేశ్వరరావు అను నాకు S.R.O., భీమడోలు **డాక్యుమెంట్సు నెంబరు 3350/1960** అనే డాక్యుమెంట్సు పట్టుకొని భీమడోలు రిజిష్టర్ ఆఫీసుకు వెళ్ళి తిరిగి పూళ్ళ గ్రామంనకు వెళ్ళుచుండగా భీమడోలు రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో దస్తావేజు ఉన్న కవరు పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఈ దస్తావేజులు (ఆస్తి పత్రాలు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియచేయవలసిందిగా కోరుచున్నాము.

మాకాని వెంకట హరిబాబు
S/o. నాగేశ్వరరావు
పూళ్ళ, భీమడోలు మండలం
సెల్: 98662 79459